క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: నగరంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద నిర్మితమైన విద్యుత్ ఉప కేంద్రం 11 కేవీ నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని ఆర్టీసీ డిపో రోడ్, రాయల్ కన్వెన్షన్ వద్ద నుంచి ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం వరకు, అరణ్య భవన్, ఇంటర్నేషనల్ హెల్త్‌కేర్, టిడ్కో గృహసముదాయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

అగ్రిగోల్డు బాధితులను ఆదుకోవాలి

ఫిరంగిపురం: అగ్రిగోల్డు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని అగ్రిగోల్డు కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అగస్టీన్ అన్నారు. మండలకేంద్రంలో సోమవారం కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డు ఈనెల 15న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ కరిముల్లా, చిన్నప్ప, పలువురు ఏజెంట్లు పాల్గొన్నారు.

9న రాజ్యాంగ హక్కుల రక్షణ సదస్సు

మంగళగిరి: ఎస్సీ, ఎస్టీ రాజ్యాంగ హక్కులను సర్వనాశనం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరశిస్తూ మాల మహాసభ, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ లయోలా ఆడిటోరియంలో ఈనెల 9వ తేదీన నిర్వహించ తలపెట్టిన రాజ్యాంగ హక్కుల రక్షణ సదస్సును జయప్రదం చేయాలని మాల మహాసభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు అన్నారు. సదస్సు జనసమీకరణలో భాగంగా సోమవారం మంగళగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. వేమాల దానియేలు, నెమలికంటి దాసు పాల్గొన్నారు.

సీపీఎం నేతల ధర్నా

తాడేపల్లి రూరల్: విద్యుత్ ఛార్జీలు పెంచడం దుర్మార్గమని, రానున్న రోజుల్లో మరో విద్యుత్ పోరాటం కొనసాగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం శ్రేణులు విస్తృత ప్రచారాన్ని నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఎం కార్యదర్శి పాశం రామారావు, నాయకులు భాస్కరయ్య, సూర్యారావు, ఎం.రవి, జె.శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వి.దుర్గారావు, కె.శివరామకృష్ణయ్య, ఇ.రామారావు, వి.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసకుమారి, పి.గిరిజ, ఉష తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసరాల ధరలు తగ్గించాలని వినతి



ఫిరంగిపురం: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ పద్మనాభుడికి, ఎంపీడీఓ డి.అనూరాధకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరారు. ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, రూ.400కే గ్యాస్ సిలిండర్‌ను అందజేయాలని, ప్రజా పంపిణీ ద్వారా కందిపప్పు, నూనె సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో పార్టీ మండలకార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వరరావు, సాంబశివరావు, బాలిరెడ్డి, అంకమ్మరావులు పాల్గొన్నారు.

గంగానమ్మ తల్లికి సారె

భారీగా పాల్గొన్న భక్తులు



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పేరుకలపూడి గ్రామంలో కొలువై ఉన్న గంగానమ్మ తల్లికి సోమవారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా పేరుకలపూడిలో మహిళలు అమ్మవారి చిత్రపటంతో గ్రామ పురవీధుల్లో జాతర నిర్వహించారు. ఈ జాతరలో మహిళలు గంగానమ్మ తల్లికి పసుపు, కుంకమతో పాటు ఇతర పూజా సామగ్రిని తీసుకుని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు భారీగా పాల్గొనడంతో పేరుకలపూడి పంచాయతీ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పలు ఏర్పాట్లు చేశారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా
- సిరిపురంలో ప్రభుత్వ నూతన భవనాలు ప్రారంభం



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

మేడికొండూరు: సీఎం వైఎస్ జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గుంటూరు జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో సోమవారం పలు ప్రభుత్వ నూతన భవనాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని, దానికి తార్కణం గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలేనని ఆమె వివరించారు. గ్రామీణ ప్రాంతవాసులకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మించడం జరుగుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ కరోనా సమయంలో ఎంతోగానో ఉపయోగపడిందని ఆమె గుర్తుకు తీసుకువచ్చారు. తొలుత గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, వైస్ ఎంపీపీ రాజశేఖరరెడ్డి, గ్రామ సర్పంచి కుంభా త్రివేణి, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, కాసు విజయమ్మ, జోసఫ్ రెడ్డి శౌర్రెడ్డి, జయపాల్ రెడ్డి, పాములపాటి వీరయ్య, గాలిబ్, ఆవుల సంజీవరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, కృష్ణమోహన్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఉప సర్పంచ్ ఎన్నిక

- వైఎస్సార్ సీపీకి పదవి రాకుండా టీడీపీ విశ్వ ప్రయత్నం
- జగనన్నకే మొగ్గు చూపిన ప్రజాప్రతినిధులు
- దుగ్గిరాల, మోరంపూడి ఉప సర్పంచ్‌లుగా షేక్ నాగుల్ మీరా, విజయ్‌కుమార్ ఏకగ్రీవ ఎన్నిక



దుగ్గిరాల ఉప సర్పంచ్‌గా ఎన్నికైన షేక్ నాగుల్ మీరాను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు



మోరంపూడి ఉప సర్పంచ్‌గా ఎన్నికైన విజయ్ కుమార్‌ను అభినందిస్తున్న ప్రజా ప్రతినిధులు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల, మోరంపూడి గ్రామాల్లో ఉప సర్పంచ్‌లను నూతనంగా ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు ఏకగ్రీవంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను బలపర్చారు. దుగ్గిరాల, మోరంపూడి ఉప సర్పంచ్‌లుగా కొత్తగా ఎన్నుకోవడంతో నారా లోకేష్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్‌లుగా తమ పార్టీకి చెందిన వార్డు సభ్యులను ఎంపిక చేయాలని విశ్వ ప్రయత్నాలు చేశారు. ఉప సర్పంచ్ పదవి కోసం టీడీపీకి చెందిన కొందరు మాజీ ప్రజాప్రతినిధులతో పాటు మంగళగిరి నియోజకవర్గ టీడీపీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు వారం రోజుల పాటు దుగ్గిరాలలో తిష్టవేసి వైఎస్సార్ సీపీ వార్డు సభ్యులను మభ్యపెట్టి భయభ్రాంతులకు గురి చేసి సామ, దాన, బేధ, దండోపాయాలను ప్రయోగించారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీ చేస్తున్న సంక్షేమ పథకాలను, ప్రజలకు జరుగుతున్న మేలును ప్రజాప్రతినిధులుగా గెలిచిన టీడీపీ వారు సైతం ఆహ్వానించడంతో మోరంపూడిలోనూ, దుగ్గిరాల లోనూ ఏకగ్రీవంగా ఉప సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. ఉప సర్పంచ్‌లుగా దుగ్గిరాలకు షేక్ నాగుల్ మీరాను ఎన్నుకోగా మోరంపూడి ఉప సర్పంచ్‌గా చీలి విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. దుగ్గిరాల పంచాయతీ ఏర్పాటిన నాటి నుంచి ఇప్పటి వరకు మైనార్టీలకు చెందిన వారు ఒక్కరు కూడా ఉప సర్పంచ్‌గా ఎన్నుకోలేదు. మొట్టమొదటిసారిగా దుగ్గిరాల మైనార్టీకి చెందిన వార్డు సభ్యుడు షేక్ నాగుల్ మీరాను ఎన్నుకోవడంతో మైనార్టీ సంఘ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీలో మైనార్టీలకు పాలనలో స్థానం కల్పించడంతో వారు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్‌లుగా ఎన్నికైన వారిని ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డు చైర్మన్ బాజి, సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.

యూటీకే లిఫ్ట్ ఇరిగేషన్‌కు సాగునీరు విడుదల



యూటీకే లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి విడుదల చేసిన సాగునీరు

తాడేపల్లి రూరల్: మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి యూటీకే లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి సాగునీరు విడుదలలో జాప్యం జరిగింది. స్థానికంగా ఉన్న రైతులు ఇటీవల ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సోమవారం నీటిని విడుదల చేయించారు. ఉండవల్లిలో ఉన్న యూటీకే లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులు చేయడంతో పాటు కొత్తగా పైపులైన్లు ఏర్పాటు చేయడంలో జాప్యం జరిగింది. దీంతో పాటు మోటార్లు కూడా మరమ్మతులకు గురికావడంతో సాగునీటి సంఘాలు నీటిని విడుదల చేయలేకపోయాయి. ఉండవల్లి, తాడేపల్లి, కొలనుకొండకు చెందిన రైతులు సాగునీటి సమస్యను ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకు రాగా ఆయన లిఫ్ట్ ఇరిగేషన్‌ను సందర్శించి పదిరోజుల్లో సాగునీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించడంతో యుద్ధప్రాతిపదికన పైపులైను నిర్మాణ పనులను పూర్తి చేసి మోటార్లు మరమ్మతులు చేయించి సాగునీటిని విడుదల చేశారు. సాగునీటి విడుదలలో ఎమ్మెల్యే ఆర్కే చూపించిన చొరవ పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మంచి చెడు స్పర్శలపై అహగాహన

తెనాలిరూరల్: కిశోర బాలికలు మంచి చెండు స్పర్శలపై అహగాహన కలిగి ఉండాలని న్యాయవాది పేట ప్రత్యూష అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని చైతన్య స్కూలులో మంచి చెండు స్పర్శలపై అహగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అదే విధంగా యుక్త వయసులో ఉన్న పిల్లలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు. ప్రత్యూష మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులే కాకుండా తెలిసిన వారు సైతం బాలికలతో చెడుగా ప్రవర్తించే సందర్భాలు ఉంటాయని, అలాంటి ఘటన ఎదురైతే వెంటనే సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయంలో, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. 18 ఏళ్ల లోపు కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళలకు రక్షణ కవచంగా వున్న దిశ యాప్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, మహిళా పోలీస్ కళ్యాణి విద్యార్థినులు పాల్గొన్నారు.

'మధురకవి' నూతక్కి అబ్రహాం విగ్రహ ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే శివకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న

కొలకలూరు(తెనాలి): పట్టణంలో ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటున్న తెనాలి బండ్‌పై రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన 'మధురకవి' నూతక్కి అబ్రహాం విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని ఆ గ్రామానికి చెందిన మండల వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, గ్రామస్తులు సోమవారం వినతి పత్రం అందజేశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే శివకుమార్‌ను కలిసి విజ్ఞప్తిచేసినట్టు సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు. మహాకవి గుర్రం జాషువా ప్రియశిష్యుడైన నూతక్కి అబ్రహాం, తన సాహిత్యంతో జాతీయస్థాయి గుర్తింపు పొందారనీ, కవికోకిల, కావ్యకళానిధి బిరుదులు పొందారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ అబ్రహాం విగ్రహ ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు దోసపాటి నాగదేవిక, కాలిశెట్టి ఫణికుమార్, చెక్కా సీతమ్మ, ప్రసాదం బాలగురవమ్మ, నల్లూరి సుమతి, కొలకలూరి నాగేశ్వరరావు, కోడూరు రమేష్, కొలకలూరి పాపారావు, కొలకలూరి చలమయ్య, కొలకలూరి మోషే, మల్లవరపు బాబీ, పినపాటి అనిల్‌కుమార్, సుద్దపల్లి కనకరాజ్, పాస్టర్ సురేష్, సుద్దపల్లి వీరయ్య, మల్లవరపు బుల్లియ్య, ఉన్నం గోవర్ధన్, కొలకలూరి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉమేష్‌చంద్రకు ఘన నివాళి



ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ఖాలేదా నసీం, డీఎస్పీ జనార్దనరావు

తెనాలిరూరల్: దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్‌చంద్ర 24 వ వర్ధంతిని సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సబ్ డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో చెంచుపేటలో జరిగిన కార్యక్రమంలో ఉమేష్‌చంద్ర కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీం, డీఎస్పీ బి.జనార్ధనరావు, పలువురు పోలీస్ అధికారులు, ఉమేష్‌చంద్ర కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారిగా ఉమేష్‌చంద్ర సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు. యువతరం ఆయన ధైర్య సాహసాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకిత భావం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అసాంఘిక శక్తులపై ఉమేష్‌చంద్ర ఉక్కు పాదం మోపారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐలు కె.చంద్రశేఖర్, ఎస్.వెంకట్రావు, రమేష్ బాబు, శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు విజయ్ కుమార్, ఉమా మహేశ్వరరావు, బి.శివరామయ్య, ఉమేష్‌చంద్ర తండ్రి చదలవాడ వేణుగోపాలరావు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు దేవాభక్తుని ఉమామహేశ్వరరావు, తుమ్మల సత్యానారాయణ, కొడాలి రవీంద్ర, యలవర్తి లక్ష్మయ్య చౌదరి, కొండా శివారెడ్డి, ఆళ్ల వీరారెడ్డి, అయినంపూడి కోటేశ్వరరావు, రావెళ్ల మురళి, ముద్దాభక్తుని రమణయ్య పాల్గొన్నారు.

తెనాలి చేరుకున్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ సంక్షేమ సమగ్ర సర్వే యాత్ర

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సమస్యలపై దృష్టి సారించి, పరిష్కరించేందుకు కృషిచేయాలని అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కోరారు. ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమ సమగ్ర సర్వే యాత్ర సోమవారం తెనాలి చేరుకుంది. బాలాజీరావుపేటలోని సంఘ కార్యాలయం వద్దకు విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు డీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరిరావు, ఉపాధ్యక్షుడు కె.పాల్‌రాజు, కోశాధికారి ఎం.శ్రీధర్ రవిబాబుకు స్థానిక సంఘ నాయకులు ఘన స్వాగతం పలికారు. వర్కర్ల సమస్యలపై చర్చించారు. పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ది తెనాలి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అండ్ వైర్‌మెన్ పర్మిట్ హోల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పసుపులేటి పూర్ణచంద్రరావు, కార్యదర్శి తాడిబోయిన సోమసుందర్, కోశాధికారి పెదలంక వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వాసు, సంయుక్త కార్యదర్శి మేకల నాంచారయ్య, గౌరవ అధ్యక్షుడు మంగళాపురపు నటరాజబాబు పాల్గొన్నారు.

ప్రియుడు ఇంటి ముందు ప్రియురాలు ఆత్మహత్యాయత్నం

మంగళగిరి: విజయవాడ కృష్ణనగర్‌లో నివాసముంటున్న సుధీర్, పూజిత గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. సుధీర్ కుటుంబం గత కొద్ది రోజుల క్రితం నగర పరిధిలోని ఆత్మకూరులో నివాసముంటున్నారు. పూజిత ఎంత ప్రయత్నించినా సుధీర్ సమాధానం చెప్పకపోవడంతో పూజిత మంగళవారం రాత్రి సుధీర్ నివాసానికి చేరుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే స్పందించిన స్థానికులు ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించినట్లు ఎన్ఆర్ఐ ఆసుపత్రి వర్గాలు తెలిపారు.

కర్ణాటక గవర్నర్ ఎదుట తెనాలి చిన్నారుల నృత్యం



చిన్నారులకు నగదు బహుమతిని అందజేస్తున్న గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్



గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్‌తో చిన్నారులు, వారి తల్లిదండ్రులు

తెనాలి: పట్టణానికి చెందిన చిన్నారులు గ్రీష్మశ్రీ (6), తహసీన్ (11) అరుదైన అవకాశాన్ని అందుకున్నారు. బెంగళూరులోని రాజ్‌భవన్‌లో కర్ణాటక రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ఎదుట శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించారు. చిన్నారుల నృత్యాభినయాన్ని తిలకించిన గవర్నర్, చిన్నారులను ఆశీర్వదించారు. నగదు బహుమతిని అందజేశారు. తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని, రాజ్‌భవన్ నుండి ఆహ్వానం రావటం, గవర్నర్ నుండి తమ బిడ్డలకు ఆశీర్వచనం లభించటం ఎంతో ప్రోత్సాహకరంగా ఉందని గ్రీష్మశ్రీ, తహసీన్‌ల తల్లిదండ్రులు బెంగళూరు నుంచి స్థానిక విలేకరులకు తెలియజేశారు. ప్రముఖ నృత్యగురువు నిర్మలా రమేష్ శిక్షణలో నృత్యసాధన చేస్తున్న గ్రీష్మశ్రీ, తహసీన్‌లు చిన్నవయసులోనే చక్కని ప్రతిభను సాధించారని చెప్పారు. ఈ చిన్నారులను మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అభినందించారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

తెనాలిఅర్బన్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సోమవారం వైభవంగా నిర్వహించారు. చిన్నారులు గోపికలు, రాధ, కృష్ణుని వేషధారణలు అందరినీ అలరించాయి. అలాగే ఉట్టిని కొట్టే కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో సుధారాణి ఈకేవైసీ తీసుకుంటున్న వలంటీర్ ఎస్‌కే రబ్బానీ

తాడేపల్లి రూరల్: మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 13వ సచివాలయంలో వలంటీర్‌గా పనిచేసే ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై తెలంగాణ రాష్ట్రం లోని హైదరాబాద్‌కు వెళ్లి సోమవారం ఉదయం ఓ వృద్ధురాలికి పెన్షన్ అందజేశాడు. వివరాల ప్రకారం... 13వ సచివాలయ పరిధిలో పోలకంపాడు 11–236 నివాసంలో ఉండే వృద్ధురాలు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లోని వనస్థలిపురం ఎన్‌జీఓస్ కాలనీకి వెళ్లిన సమయంలో గుండెపోటు వచ్చింది. దీంతో ఆమె బంధువులు అక్కడే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ చేయించారు. ఒకటో తేదీ పెన్షన్ ఇచ్చేందుకు వెళ్లిన రబ్బానీకి ఈ విషయం తెలియడంతో ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ వెళ్లి గుండె ఆపరేషన్ చేయించుకున్న వృద్ధురాలు సుధారాణికి పెన్షన్ అందజేశాడు. వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఇంత దూరం పెన్షన్ ఇవ్వడానికి వచ్చినందుకు వలంటీర్ రబ్బానీకి వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపింది.

వేమవరం ఉపసర్పంచిగా జైపాల్



జైపాల్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రమణకుమార్, సర్పంచ్ శివకుమారి

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామ ఉప సర్పంచిగా 9వ వార్డుకు చెందిన జెమ్మి జైపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉపసర్పంచిగా ఉన్న కె.నాగరాజ ఒప్పందంలో భాగంగా తప్పుకున్నారు. దీంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు సోమవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో జైపాల్‌ను మూడవవార్డు సభ్యురాలు పి.కవిత ప్రతిపాదించగా ఒకటోవార్డు సభ్యురాలు మందాల రత్నారెడ్డి బలపరిచారు. మరి ఏ ప్రతిపాదనలు రానందున జైపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.రమణకుమార్ తెలిపారు. అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మున్నంగి శివకుమారి, ఇంచార్జి కార్యదర్శి సత్యానంద్, వార్డుసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేత



మృతుని కుటుంబానికి నగదు అందజేస్తున్న ఇన్‌చార్జి అడ్మిన్ నరేష్

తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక రెండవ సచివాలయంలో ఓ వ్యక్తి అనారోగ్యంతో చనిపోవడంతో సోమవారం మట్టి ఖర్చుల నిమిత్తం సచివాలయ ఇన్‌చార్జి అడ్మిన్ మృతుని కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. పెనుమాక రెండవ సచివాలయ పరిధిలో నివాసం ఉండే పుదియా విశల్ ఇబ్రహీమ్ అనారోగ్యంతో మృతి చెందాడు. వలంటీర్ కిరణ్మయి ద్వారా సమాచారం అందుకున్న సచివాలయం ఇన్‌చార్జి అడ్మిన్ నరేష్ ఉన్నతాధికారులకు సమాచారం అందించి వైఎస్సార్ బీమా కింద సత్వరమే మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేల నగదును మృతుని భార్య షఫీ హున్నీసాకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు బొక్కా ప్రసన్న (నాని), భుజంగరావు, బషీర్, చిన్ని, శౌరి పాల్గొన్నారు.

వృద్ధురాలి అంత్యక్రియలకు ఆర్థికసాయం

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధి పెనుమాక గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పెనుమాకకు చెందిన షేక్ సైదమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబం ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే మృతురాలి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక నాయకుల చేతుల మీదుగా అందజేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మేకా దామేష్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు బొక్కా ప్రసన్న (నాని), భుజంగరావు, కోటిరెడ్డి, బషీర్, అల్లు శ్రీనివాసరెడ్డి, మేకా అంజిరెడ్డి, అన్నూరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మ్యూజికల్ చైర్ పోటీలు



మ్యూజికల్ చైర్స్ పోటీలో ఉపాధ్యాయినులు

తెనాలి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పట్టణ అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులకు మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయినులకు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా ఈ పోటీలను జరిపారు. ఉపాధ్యాయిని విభాగంలో రాబియా బాసరి, జాన్‌బీ ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకోగా, ఉపాధ్యాయుల్లో కరిముల్లా, ప్రకాశరావు మొదటి, రెండు బహుమతులను సాధించారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయుడు రాజకిషోర్ కోరారు. ఉపాధ్యాయుల ఆటల పోటీలు విద్యార్థులకు స్ఫూర్తిని ఇస్తాయని చెప్పారు. ప్రసూనాదేవి, అస్మతున్నీసా, వెంకటరమణ, బాలమ్మ, ప్రసాద్, మనోజ్, ఆంజనేయ శర్మ, విజయ్‌సింహ, నవీన్, శ్రీను, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.